కథా నిలయం
శ్రీకాకుళం

# సశేషం

ఈరోజు వేలెంటైన్స్ డే. ప్రేమికుల దినంట. డిస్కోలు, పబ్‌లు, హోటళ్లు, బొకేలవాళ్లు డబ్బులు చేసుకునే రోజు. ప్రేమికులన్నవాళ్లకి ప్రత్యేకం ఓ రోజెందుకో. అంటే, ఆ రోజొక్కరోజే ప్రేమించుకుంటారటనా! కొత్తగా విదేశాల నుంచి దిగిన ఆచారాలతో ఇదొకటి. పేరెంట్స్‌డే, మదర్స్‌డే, బ్రదర్స్‌డే... విదేశాలలో అంటే ఎవరికి వారే యమునాతీరే గనక ఏడాదికి ఈ వంకనైనా ఓ రోజు కల్సుకోడానికి వచ్చివుంటాయి. మన దేశంలో మనకెందుకివి –

యింకా కాస్తో కూస్తో మానవ సంబంధాలు మిగిలే వున్నాయి. అమ్మ, నాన్న, అక్క చెల్లి అంతా కలిసి ఉండే కుటుంబ సంస్కృతి మిగిలివుందిగా. ఈ వాలంటేన్స్‌డే అంటే బారులు నిండా బీరులు పారుతాయి. డిస్కోలు హోరెత్తడం అర్థరాత్రుళ్లు వరకు తాగి, డాన్సులు చేసి ఆడ, మగ తేడా మరిచే రోజు.

ఒంటిగంటన్నర అయింది. ఇంకా ఇల్లు చేరని కూతురు గురించి ఆరాటపడ్తూ నిద్రపట్టక దొర్లుతోంది రమ. స్నేహితులతో హోటల్లో పార్టీకి వెళతానన్న కూతుర్ని ఏవిధంగానూ ఆపలేనని తెల్సుకనుక, పన్నెండు లోపల ఇల్లు చేరమని గంభీరత నటిస్తూ ఆజ్ఞాపిస్తున్నట్లు అంది. కూతురు నిర్లక్ష్యపు నవ్వు విసిరి, జుట్టు పైకి తోసుకుంటూ, హైహీల్స్ టకటక లాడించుకుంటూ బయటికి వెళ్లింది. కూతురు ఏనాడూ రాత్రి పన్నెండులోగా ఇల్లు చేరలేదు. తెల్సినా, తల్లిగా తనేదో కట్టడి చేస్తున్నాననుకుని చెప్తుంటుంది రమ. అలా బయటికి వెళ్లిన రోజు తల్లికి శివరాత్రే. ఎంత పట్టించుకోకూడదు, అదెలాగో రాదు అని తెల్సినా, కూతురు వచ్చే వరకు నిద్రపోకుండా, వచ్చాక తలుపు తీసి, ఓ తీక్షణచూపు విసిరి, తనకి కోపం

వచ్చిందన్నట్టు తలుపు కాస్త విసురుగా వేసి, విస విస గదిలోకి వెడ్తుంది రమ. చాలాసార్లే జరిగింది. లెక్క అనవసరం అనుకుంటుంది రమ.

ఇవాళ వేలంటైన్స్‌డే. రెండుదాటి పది నిమిషాలు అయినా కూతురు ఇల్లు చేరలేదు. నిద్రపట్టక అటు ఇటు పక్కమీద దొర్లుతూంటే భర్తకి ఎక్కడ మెలకువ వస్తుందోననుకొని కూతురి గదిలోకి వెళ్లి పడుకుంది గంటక్రితమే. రానీ, ఇంటికి రానీ, దాని పని చెప్తా. ఏం చెయ్యలేని నిస్సహాయతతో పళ్లు కొరుక్కుంది. వచ్చాక ఏం చేస్తుంది. తను నోరిప్పి ఒకటి అనే సరికే పది మాటల తూటాలు కూతురి దగ్గర సిద్ధంగా ఉంటాయి. "డోంట్ బీ సిల్లీ అమ్మా, ఫ్రెండ్స్‌తో తిరగక పోతే నీతో తిరుగుతానా, నీకన్నీ అనుమానాలే, కూతురినే నమ్మవు. చూడు, చుట్టూ చూడు, ప్రపంచం ఎలా మారిందో... అమ్మా, నేను ఉద్యోగం చేస్తున్న పాతికేళ్ల అమ్మాయిని. నన్నింకా టీనేజ్ గర్ల్‌లా ట్రీట్ చేసి కంట్రోలు చెయ్యాలని చూడకు. బాయ్‌ఫ్రెండ్స్‌తో సరదాగా తిరగడం అంటే వాళ్లతో సంబంధాలు పెట్టుకోవడం అనా. అమ్మా గ్రో అప్" అంటూ కడిగి పారేస్తుంది.

ఆలోచనలని చెదరగొడ్తూ సెల్ మోగింది. 'కూతురే అయివుంటుంది. ఇంకా రానంటుందా, ఆలస్యం అవుతుందంటుందా' అనుకుంటూ కోపంగా ఫోను తీసింది. ఏదో కొత్త నెంబరు.

"హలో" అంది రమ.

"ఈజిట్ మిసెస్ రమాదేవి"

"ఆ... అవును. మీరు... మీరెవరు?" అర్ధరాత్రి కొత్త వ్యక్తి నుంచి ఫోను గాబరాపడింది.

"జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్.ఐ. జనార్ధన్ మాట్లాడుతున్నాను." రమ గుండె ఒక్క క్షణం లయతప్పింది. గొంతు తడారిపోగా,

"పోలీస్ స్టేషన్...? ఏమిటి? ఎందుకు?" మాట తడబడింది ఆమెకి.

"భావన మీ కూతురేనా?"

"అ.. అ... అవును. ఏమయింది భావనకి?" గాబరాగా అరిచినట్టే అడిగింది.

"మీరు, మీవారు ఒకసారి పోలీస్‌స్టేషన్‌కి రావాలి?"

"ఎందుకు? ఏం జరిగింది. ఏం చేసింది మా అమ్మాయి. ప్లీజ్ దయచేసి చెప్పండి."

"చూడండీ! మీ అమ్మాయి మగ పిల్లలతో కలిసి ఇక్కడ పబ్‌లో తాగి తందనాలు ఆడుతుంటే, రైడ్ చేస్తే దొరికిపోయిన వారిలో మీ అమ్మాయి వుంది. దయచేసి మీరు వెంటనే రండి" ఫోను పెట్టేశాడు ఇన్‌స్పెక్టర్.

రమ చేతిలోని ఫోను జారిపోయింది. ఒళ్లంతా చెమట పట్టింది. పరుగెడుతున్నట్టే ప్రసాద్‌ని లేపడానికి వెళ్లింది. మంచి నిద్రలోంచి హఠాత్తుగా లేచిన ప్రసాద్‌కి భార్య చెప్తున్నది అర్థం కావడానికి చాలా టైము పట్టింది. అర్థమయ్యాక పాలిపోయిన మొహంతో లేచి బట్టలు మార్చుకున్నాడు.

* * * * * *

"సారీ సార్, ఈరోజు వేలంటైన్స్‌డే అని పిల్లలు కాస్త ఓవర్ చేసినట్లున్నారు. ప్లీజ్ కేసు రిజిస్టర్ చేసి కస్టడీలోకి తీసుకుంటే... వాళ్ల భవిష్యత్తు గురించి కాస్త ఆలోచించండి. ప్లీజ్" ప్రసాద్ చాలా ఉద్వేగంగా ఇన్‌స్పెక్టరుకి ఐదునిమిషాల నుంచి చెప్పిందే చెపుతూ అన్నాడు. అతనిలాంటి తండ్రులు ఇంకా నలుగురైదుగురు ఇదే విషయం చెపుతూ బతిమిలాడుతున్నారు.

"చూడండిసార్! ఈరోజు పోలీసులు సీన్‌లోకి వచ్చేవరకు మీ పిల్లలని అందులో ఆడపిల్లలని, కాస్త కట్టడిలో పెట్టుకోవాలని తెలియదా... అర్థరాత్రి రెండు గంటల వరకు ఆడపిల్లలు మగపిల్లలతో సమానంగా తాగి డాన్సులు చేస్తూ ఏఅర్థరాత్రో ఇల్లుచేరితే మందలించి ఎలా అదుపులో పెట్టుకోవాలో తెలియదా.. ఏదన్నా జరగ రానిది జరిగితే అప్పుడు మేం గుర్తువస్తాం. పోలీసులు సరిగా డ్యూటీ చేయలేదంటారు. మా డ్యూటీ మమ్మల్ని చెయ్యనివ్వండి. తల్లిదండ్రులుగా ముందు మీకు తెలియజేయడం మా ధర్మం కనక తెలియచేశాం. ఇప్పుడింక మా చేతిలో ఏం లేదు. రేపు ఆదివారం, సోమవారం కోర్టులో ప్రొడ్యూస్ చేస్తాం. మీరు అప్పుడు బెయిలు ప్రయత్నం చేసుకోండి" గంభీరంగా అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"ఇన్‌స్పెక్టరుగారూ, ఏదో మొదటిసారి, పిల్లలు వేలంటైన్స్‌డే సరదాలో గీత దాటారు. ఈ ఒక్కసారికి క్షమించండి" బతిమాలసాగారు తల్లిదండ్రులు.

"మొదటిసారా?" తలవంచుకుని నిల్చున్న నాలుగైదు జంటల వంక చూస్తూ "ఇది మొదటిసారేమో వాళ్లనే అడగండి" అన్నాడు హేళనగా. అందరూ తల్లిదండ్రుల వైపు చూసి తలలు దించుకున్నారు. ప్రసాద్ నిర్ఘాంతపోతూ రమ వైపు చూశాడు. రమా తెల్లపోతూ కూతురి వంక అనుమానంగా చూసింది. భావన తలదించుకుంది.

"ఊ... చెప్పమనండి. ఇది మొదటిసారని. ఇదివరకు ఓసారి నేనే రైడ్ చేశాను. అప్పుడున్న వాళ్లు ఇప్పుడూ ఉన్నారు. మొదటిసారి వాళ్ల భవిష్యత్తు పాడవుతుందని వార్నింగ్ ఇచ్చి వదిలేశాం. పబ్ యజమానికి వార్నింగ్ ఇచ్చాం. అయినా ఎంత ధైర్యం వీళ్లకి. టైమెంత ఇప్పుడు, రెండున్నర. ఇప్పటివరకు పిల్లలు ఇంటికి రాలేదన్న ధ్యాస లేదా మీకు. ఇలా విచ్చలవిడిగా వదిలేసి, ఇప్పుడొచ్చి పరువు - ప్రతిష్టల గురించి మాకు నీతులు బోధిస్తున్నారు" తలవాచేట్లు చివాట్లు పెడుతున్న ఇన్‌స్పెక్టరు మొహం చూడలేక పెద్ద, చిన్న అంతా తలలు దించుకున్నారు.

"పిల్లలుపార్టీ అంటే ఏదో హోటలుకి వెడతారు అనుకున్నాం. రాత్రి పన్నెండు నుంచి, నేను మా అమ్మాయి సెల్‌కి ఫోను చేస్తూనే ఉన్నాను. సెల్ ఆన్సర్ చేయలేదు. తరువాత ఆఫ్ చేసి వుంది. తల్లిదండ్రులం పిల్లలు ఇంటికి రాలేదని ఆరాటపడ్తూ నిద్రపోకుండా కూర్చున్నాను" రమ సంజాయిషీ ఇస్తున్నట్లంది.

"చూడండి మేడమ్! మా డ్యూటీ మేంచేయాలి. ఎఫ్.ఐ.ఆర్. రాసి సోమవారం కోర్టులో ప్రవేశపెడ్తాం. అప్పుడొచ్చి మీరేం చేసుకుంటారో చూసుకోండి. కానిస్టేబుల్! అందరిపేర్లు, ఎడ్రసులు, ఫోను నెంబర్లు నోట్ చేసుకుని, అందరి దగ్గరా సెల్‌ఫోన్లు తీసుకోండి" ఆర్డరు జారీ చేశాడు. పెద్దలంతా కలవరపడి మొహాలు చూసుకున్నారు. ఏం చెయ్యాలో అర్థం కాలేదు.

"ప్లీజ్ కాసేపు ఆగండి. నేను కమీషనర్‌గార్కి ఫోను చేస్తాను. ఆయన నాకు చాలా సన్నిహితుడు. ఆయనతో మాట్లాడేవరకు ప్లీజ్ కాస్త ఆగండి" ఓ పెద్ద ప్రభుత్వోద్యోగి సెల్‌ఫోన్లో నెంబరు నొక్కసాగాడు.

ఇన్‌స్పెక్టరు మొహం ఎర్రబడింది. "సార్... చూడండి. మీరు పెద్దవారు. మీ ఇన్‌ఫ్లుయన్స్ ఉపయోగించి, మా డ్యూటీ మమ్మల్ని చేయనీయకుండా అడ్డుకుందామనుకోవడం సరి అయిన పనికాదు. అంతే కాదు, పిల్లల తప్పులను పరోక్షంగా మీరే ప్రోత్సహించుతున్నట్టా? కాదా? ఏం చేసినా ఫరవాలేదు మా నాన్నలు, అమ్మలు మమ్మల్ని ఆదుకుంటారన్న అభయం ఇస్తున్నారు" కోపంగా అన్నాడు.

తల్లిదండ్రులు తలలు దించుకున్నారు. "సారీ, ఇన్‌స్పెక్టర్ మీరు చెప్పిందంతా నిజమే. కానీ ఒక్కసారి ఆలోచించండి. ఇది పిల్లల భవిష్యత్తుకి సంబంధించిన విషయం. ఇందులో అమ్మాయిలున్నారు. వాళ్లిలాంటి కేసుల్లో ఇరుక్కుని వాళ్ల ఫోటోలవి బయటికినస్తే వాళ్లకింక పెళ్లి..." ఒక తల్లి భయం భయంగా అంది.

"ఓ అమ్మాయి - పెళ్లిళ్లు - ఇప్పుడు గుర్తుకొచ్చాయా... వాళ్లిలా అర్ధరాత్రి వరకు తిరగడం తప్పుకాదు అని వదిలేశారా. అబ్బాయిలు తిరగ్గాలేనిది అమ్మాయిలు ఎందుకు తిరగకూడదని అమ్మాయిలతో పాటు మీరు అనుకుని బయిటికి వెళ్లనిచ్చారా! అమ్మాయిలు చదువుకుంటున్నారు. ఉద్యోగాలు చేసి సంపాదించుకుంటున్నారు. అబ్బాయిలకి లేని ఆంక్షలు ఎందుకనేగా ఈనాటి యువత అభిప్రాయం. అలాంటప్పుడు అబ్బాయిలతోపాటు అమ్మాయిలూ శిక్షార్హులే గదా! తేడా వద్దను కున్నప్పుడు, మళ్లీ అమ్మాయిలంటూ వారి భవిష్యత్తు అంటూ ఆరాటం ఎందుకు. మా దృష్టిలో రూల్సు అతిక్రమించిన అందరూ ఒకటే" ఇన్స్పెక్టరు గంభీరంగా అన్నాడు.

అందరూ నిస్సహాయంగా మొహాలు చూసుకున్నారు. ఈగొడవ జరుగుతున్నప్పుడే ఛానల్ వాళ్లకి కబురంది నలుగురైదుగురు గబగబా కెమెరాలు పట్టుకు వచ్చారు. ఛానల్ వాళ్లని చూడగానే అంతా కంగారు పడ్డారు. కొందరు అమ్మాయిలు మొహానికి అడ్డుపెట్టుకున్నారు. గబ గబ భావన అయోమయంగా చుట్టూ చూసింది. రమ కలవరపడ్తూ కూతురివైపు చూస్తూ "మొహం కప్పుకుని ఏడవవదేం" అనుకుంది.

అదే క్షణం వరకూ ఇలాంటి దృశ్యాలు పేపర్లలో టీవీల్లో వచ్చినప్పుడు ఇలా మొహాలు చూడకుండా మొహాలకి అడ్డుపెట్టుకోనిస్తారెందుకు? ఇలాంటి వెధవల మొహాలు అందరూ చూసి గుర్తుపడితేనన్నా ఇలాంటి వెధవ పనులు చేసే వాళ్లు కాస్తన్నా సిగ్గుపడ్తారు, భయపడ్తారు అనుకునేది, దొంగతనాలు, అత్యాచారాలు చేసినవాళ్లని ముసుగుల్లో చూసి. అలాంటిదిప్పుడు తను తన కూతురు మొహాన్ని దాచుకోలేదని గాబరాపడ్తోంది. తన ఆలోచనకి తనే సిగ్గుపడేట్టు కూతురు తననీ స్థితిలో పడేసినందుకు పట్టరాని కోపం వచ్చింది రమకి.

ఆఖరికి, పోలీసు కమీషనర్ ద్వారా చెప్పించి, ఆఖరి వార్నింగ్ ఇచ్చి అందరినీ వదిలేయమని, పేరెంట్స్ దగ్గర అలా సంతకాలు తీసుకుని వదలమని కమీషనర్ ఆదేశాలతో అంతా బయటపడ్డారు. పబ్ యజమానికి లైసెన్స్ రద్దు చేసి, జరిగిందానికి పెనాలిటీ కట్టాలని ఆదేశించి కేసు ముగించారు.

కారులో ఒక మాట కూడ మాట్లాడలేదు ప్రసాద్. రమ ఏదో అనబోతూంటే భార్య చెయ్యి నొక్కి వద్దన్నట్టు చూశాడు. ఆ నిశ్శబ్దం ఆమె తప్పిదాన్ని మరింతగా వేలెత్తి చూపుతున్నట్టు కారు సీటుకి జారగిలబడి కళ్లు మూసుకుంది ఎవరి మొహం చూడలేనట్టు భావన. ఆ సమయంలో తాగివున్న కూతురితో ఏం మాట్లాడి ప్రయోజనం

వుండదని ఆ తండ్రికి అర్థమైంది. ఇంటికి వెళ్లాక ఏం మాట్లాడకుండా ఎవరి గదుల్లోకి వారు వెళ్లిపోయారు.

మర్నాడు ఆదివారం. ఉదయం పదకొండు గంటలకి నిద్రేచిన కూతురిని తిరస్కారంగా చూసి, తల తిప్పుకుంది రమ. పేపరు చదువుకుంటున్న ప్రసాద్ ఓసారి కూతురు వైపు చూసి "స్నానంచేసిరా! నీతో మాట్లాడాలి" ప్రశాంతంగా అన్నాడు.

తండ్రివైపు చూసి మొహం మాడ్చుకుని కాఫీ కప్పు పట్టుకుని గదిలోకి వెళ్లిపోయింది.

"చూడు భావనా? ఇకపై నీవు వేరే అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకుని వుంటే బాగుంటుంది. ఎక్కడైనా చూసుకో" గంభీరంగా మొదలుపెట్టాడు.

తండ్రి మాటలు తను అనుకున్నట్టు తనపై మండిపడడంగాని, హితబోధలు, హెచ్చరికలు గానీ లేకుండా వేరేగా మొదలవడంతో భావన అర్థం కానట్టు తెల్లపోతూ చూసింది.

"నీపాటికి నీవు వేరేవుంటే నీవు కోరుకునే స్వేచ్ఛ వుంటుంది. నీవేం చేసినా అడిగేవారు, ఆంక్షలు పెట్టేవారు ఉండరు. చదువు చెప్పించాం, నీ బతుకు నీవు బతకగలిగే సంపాదన వుందిప్పుడు. ఒక అమ్మాయి తండ్రిగా నీ పెళ్లి చేసే వరకు బాధ్యత మాది, కాదనను. ఇదివరకు రోజుల మాట అది. ఆడపిల్లలకి ఆర్థిక స్వాతంత్ర్యం లేనప్పుడు పెళ్లి చేసి ఆమెని భర్తకి అప్పగించే వరకు కన్నవారి బాధ్యత. ఇప్పుడూ మేము ఆ బాధ్యత నించి తప్పించుకోవాలనుకోవడం లేదు. మేం ఎన్నిసార్లు పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టినా నీవే నచ్చినవాడిని చేసుకుంటానని దాటేస్తున్నావు. నీకు పాతికేళ్లు నిండిపోయాయి. నీ ఇష్టం వచ్చినట్టు బతికే హక్కు నీకుందని నీ ఉద్దేశం. కానీ, తల్లిదండ్రులుగా మా ఇంట్లో నీవు ఉండాలంటే కొన్ని కట్టుబాట్లకి లోబడి వుండాలని మేం అనుకుంటాం. మేం యిచ్చిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను మీరు హద్దులు మీరి దుర్వినియోగపరుస్తున్నారని మాకనిపిస్తుంది. ఆడపిల్లలూ మగపిల్లలతో సమానంగా చదవాలని, ఆర్థిక స్వాతంత్ర్యం వుండాలని, ఓ వ్యక్తిత్వం, ఏ పరిస్థితులలోనైనా నిబ్బరంగా ఎదుర్కొనే మనస్థైర్యం ఆడపిల్లలకి వుండేందుకే చదువు, ఉద్యోగం ఉండాలన్నది మా అభిమతం. స్వేచ్ఛ అంటే తాగుడు, పబ్‌లు, పార్టీలు, ఆడ మగ తేడా మర్చిపోయి విచ్చలవిడితనాన్ని మేం అంగీకరించలేం. ఈ

విషయంలో నీకు మాకు చాలాసార్లు వాగ్వివాదాలు జరిగాయి. నీ పద్ధతి మార్చుకోలేదు."

"అంటే నేను బయటికి ఎక్కడికీ వెళ్లకూడదా – ఫ్రెండ్స్‌తో తిరగకూడదనా మీ ఉద్దేశం. మీరు చదువుకోమన్నంత వరకు చదివి, ఉద్యోగం చేయమంటే తలవంచుకు ఉద్యోగానికి వెళ్ళి, బుద్ధిగా ఇంట్లో కూర్చోవాలని మీ ఉద్దేశం. ఆడపిల్లలు సంపాదించాలి గాని ఏ సరదాలూ ఉండకూడదు. అబ్బాయిలతో మాట్లాడకూడదు, చదువు, ఉద్యోగం ఉన్నా మీరు నచ్చి తెచ్చిన వాడిని కట్టుకోవాలి. అలా కాదంటే, మిమ్మల్ని ఎదరించినట్టు, ఆడపిల్ల పాడయిపోయినట్టు, బరితెగించినట్టు..' ఆవేశంగా అంది భావన.

"చూడు భావనా, ఈ మాటలన్నీ మన మధ్య చాలాసార్లు జరిగాయి. ఇల్లు అన్నాక కొన్ని కట్టుబాట్లకి లోబడి అందరూ నడుచుకోవాలి. ఎవరిష్టం వచ్చినట్లు వారు నడుచుకుంటామంటే..." తండ్రి మాటకి అడ్డువస్తూ, "ఆడపిల్లలకేనా ఈ కట్టుబాట్లు. రేప్పొద్దున్న మీ కొడుకు ఇలాగే ఏ స్నేహితులతోనో బయటికి వెళితే ఇలాగే కట్టడి చేస్తారా?" జవాబు చెప్పమన్నట్లు కోపంగా చూసింది.

"తప్పకుండా అడుగుతాం. మగపిల్లాడయినా అర్ధరాత్రి వరకు పబ్బులో తాగి తంగనాలు ఆడి ఇంటికి వస్తే ఊరుకోం. ప్రతి దానికి ఓ హద్దు ఉంటుంది. స్నేహితులతో వెళ్లొద్దని ఎవరూ అనరు. సినిమాకి వెళ్లచ్చు. సరదాగా ఏ వీక్ ఎండ్‌కో హెూటల్‌కి వెళ్లవచ్చు. రాత్రి ఎనిమిదికల్లా ఇంటికి తిరిగి రావాలి పిల్లలు. అదీ కుటుంబ కట్టుబాటు. అర్ధరాత్రి అయినా పిల్లలు ఇల్లు చేరకపోతే ఆ తల్లిదండ్రుల ఆరాటం నీకెలా అర్థం అవుతుంది. అందులో ఆడపిల్ల."

"అదిగో మళ్లీ ఆడపిల్ల" అంటున్నారు.

"తప్పకుండా అంటాను. ఆడపిల్ల ఏనాటికీ ఆడపిల్లే. హద్దుల్లో ఉండాల్సింది అమ్మాయిలేనని ఈనాటికీ అనాల్సిన పరిస్థితి సమాజంలో ఉంది. అన్నట్టు ఇదిగో అసలు విషయం మర్చిపోయాను. రాత్రి తమరు చేసిన ఘనకార్యం ఫోటోలు వచ్చాయి పేపరులో. వార్త చదువుకో. ఇది చూశాక కూడా మేం నిన్ను ఏం అనకుండా, తిరుగుతల్లీ నీ ఇష్టం వచ్చినట్టు అని ఊరుకోమంటావా – అలా ఊరుకుంటే మేం అసలు తల్లిదండ్రులం కాదు. అలా ఊరుకుంటే బాధ్యతారాహిత్యం అవుతుంది. పిల్లల్ని కన్నందుకు సన్మార్గంలో పెట్టాల్సిన బాధ్యత మామీద ఉంది."

భావన ఏదో చెప్పబోతే ప్రసాద్ చేత్తో వారించి -

"చూడు నీతో వాదించే ఓపిక నాకు లేదు. నీతో మాట్లాడి బ్లడ్‌ప్రెషర్ పెంచుకుని ఆరోగ్యం పాడుచేసుకోలేను. నీ ఈ ప్రవర్తన వల్ల మీ అమ్మ పడే బాధ నేను చూడలేకపోతున్నాను. నీవు వచ్చే వరకు నిద్రపోదు. నీతో వాదన పెట్టుకున్న రోజు ఆవిడ బ్లడ్‌ప్రెషర్ పెరిగి, నిన్నెలా కంట్రోలు చెయ్యాలో అర్థంకాక, నీ భవిష్యత్తు ఏమవుతోందనని మధనపడుతూ నలిగిపోతూ, నాకు చెపితే ఇంట్లో మరింత గొడవలు వస్తాయని, నాకు చెప్పకుండా కొన్ని, చెప్పీ చెప్పనట్లుగా కొన్ని చెప్తూ, ఏం చెయ్యాలో అర్థంకాక సతమతమవుతోంది."

"అదే ఎందుకు... నా గురించి నేను జాగ్రత్త పడగలను, నా గురించి ఎవరూ వర్రీ కానవసరంలేదు. నేనేం చిన్నపిల్లని కాదు సంరక్షించడానికి."

"అవును. చిన్నపిల్లవి కావు. అందుకే మరింత చింత. ఎంత పెద్దదానివైనా పెళ్ళయ్యేవరకు ఏం జరిగినా తల్లిదండ్రులే చూడాలి అన్నది ఈరోజు సంఘటన వల్ల అయినా అర్థం కాలేదా - పోలీసులు కేసు బుక్ చేసేముందు తల్లిదండ్రులని ఎందుకు పిలిచారు? ఈరోజు చదివిన అందరూ ఫలానా భావన. ఫలానా వారి అమ్మాయి అని చెప్పుకుంటారు. అంటే పరోక్షంగా, నీ ప్రతిచర్యకి మమ్మల్ని బాధ్యులను చేస్తారు. ఇదీ మన సమాజంలోని కుటుంబ వ్యవస్థ."

"అయితే, ఈ ఇంట్లో వుంటే నా వల్ల మీకు జవాబు చెప్పుకోవడానికి ఇబ్బంది అవుతోందన్న మాట. అందుకేనా నన్ను వేరే వెళ్లమంటున్నారు. సరే అయితే అలాగే వెళ్లిపోతా..." ఉక్రోషంగా అంటూ వెళ్లబోయింది.

"ఆగు, నా మాట ఇంకా పూర్తికాలేదు. ఎక్కడికి వెళ్లినా నీవు మా కూతురివి అనే అంటారు. మా కూతురుగా కాక ఇంకోరి భార్యగా చెప్పుకునే రోజు వస్తే మా బాధ్యత తీరుతుంది. అప్పుడు నీవేం చేసినా మేం పట్టించుకోం. అంచేత ఆరోజు త్వరగా వస్తే సంతోషిస్తాం."

"అంటే, ముందింట్లోంచి వెళ్లు. ఆ తర్వాత మా జీవితాల్లోంచి తప్పుకో అని చెప్పడమా ఇది. థాంక్స్ డాడీ. చాలా బాగా చెప్పారు. కూతురిని ఇలా ఇంట్లోంచి వెళ్లమని బహుశా ఏ తండ్రీ ఇలా చెప్పి ఉండడు" ఉక్రోషంగా, కసిగా అంది.

"అలా అనే పరిస్థితి నీవు కల్పించావని నీకు తట్టి ఉంటే బాగుంటుంది."

"ఏమిటండీ ఇదంతా, దాంతోపాటూ మీరూ ఆవేశపడి, తొందరపడ్తున్నారు. ఇంట్లోంచి పొమ్మంటే ఎలా" రమ కలవరపడ్తూ అంది.

"ఆడపిల్ల ఉంటే పుట్టింట ఉండాలి, లేకపోతే మెట్టినింటుండాలి. మనం ఉండగా ఎక్కడో ఇంకో ఇంట్లో ఉండడం, అదీ ఉన్న ఊళ్లో."

"హూ.. నీవో పిచ్చిదానివి. అవి పాతరోజుల మాటలు. ఇప్పటి అమ్మాయిలు సంపాదించుకుంటున్నారు. వాళ్ల బతుకులు వాళ్లు బతికే ఆర్థిక స్వాతంత్ర్యం, ధైర్యం అన్నీ ఉన్నాయి. ఎవరినీ లెక్కచెయ్యక్కరలేదని గదా... ఏం నీ కూతురు పాతికవేలు సంపాదించుకుంటోంది. వేరే ఇల్లు తీసుకుని తనిష్టం వచ్చినట్లు స్వేచ్ఛగా ఉండనీ, తనకీ మనకీ మనశ్శాంతి దొరుకుతుంది" స్థిరంగా అన్నాడు ప్రసాద్.

తండ్రి ఇదంతా ఆవేశంలో, కోపంలో ఏదో అనడం కాదని చాలా సీరియస్‌గానే అంటున్నాడన్నది అర్థం కాగానే భావన కలవరపడింది. ఒక్కక్షణంలోనే కళ్లెదుటే ఇల్లు, వంట, ఇంటద్దె, ఖర్చులు, చాకిరీ, ఇవన్నీ కదలాడాయి. హాయిగా, నిష్పూచీగా అమ్మ ఇంట్లో తన బట్టలు వుతికించి, ఇస్త్రీ చేయించి, తన పక్క అలమార్లు సర్ది, టిఫిన్లు, భోజనాలు పెడ్తూంటే... బాబోయ్ ఇవన్నీ తను చూసుకోవాలా? ఓ పక్క ఉద్యోగం చేసుకుంటూ, ఇంటద్దె ఓ పదివేలు పోతే తనకీ డబ్బులు సరిపోతాయా... అరక్షణంలో మనసు నిండా సందేహాలు, భయం, చుట్టుముట్టాయి. ఆమె మొహంలో కలవరం స్పష్టంగా గమనించినా చూడనట్టు ఆయన చేతిలో పేపరక్కడ పడేసి లోపలికి వెళ్లిపోయాడు. కూతురి మొహం ఓసారి చూసి రమ కూడా లోపలికి వెళ్లిపోయింది.

* * * * * *

మరో ఆదివారం వచ్చింది. ఆ వీక్ అంతా కూతురు ఇల్లు కదలలేదన్నది ప్రసాదరావు గమనించి, "భావన ఇంట్లోనే ఉన్నట్టుంది ఈ రోజు" అన్నాడు భార్యతో.

"ఊ.. అసలు ఈ వారం నుంచి అది అసలు మాట్లాడడం లేదు. మీ మాటలు పనిచేసి కాస్త భయపడినట్లుంది. లేకపోతే పోలీసుల భయమో."

ఆదివారం ఉదయం ఫలహారం చేస్తుండగా, "ఎంత వరకు వచ్చింది నీ ఇంటి వ్యవహారం, ఏదన్నా ఫ్లాట్ చూసావా... నీ ఆఫీసుకి దగ్గరలో చాలా అపార్ట్‌మెంట్లు కొత్తగా వచ్చాయి. అక్కడ చూడకపోయావా."

భావన గతుక్కుమంది. తండ్రి ఆ విషయం మర్చిపోయి ఉంటాడని, కోపంలో ఏదో అన్నారని సర్దుకుంది.

"అపార్టుమెంటు చూశాక నీకు ఏదన్నా ఫర్నిచర్ కావలిస్తే తీసుకెళ్లు. నీ మంచం, బీరువా, యింకో రెండు, మూడు ఎక్స్ట్రా సోఫాలున్నాయి. తీసుకెళ్లు. వంటగిన్నెలు

అవి చాలా ఉన్నాయి. పాత గ్యాస్ స్టవ్‌కూడా వుంది. ఇంట్లో సామానేం కొనక్కరలేదు. వెంటనే, తరువాత నెమ్మదిగా నీకు కావాల్సినవి కొనుక్కో. పెళ్లయితే అమ్మాయింటికి సామానిస్తాం ఎలాగో, నీకు ఇప్పుడే ఇస్తాం కావలిస్తే" చాలా కూల్‌గా అన్నాడు. తండ్రి వంక చుర చుర చూసింది. తగ్గిపోవడం ఇష్టంలేక.

"థాంక్స్ అవసరంలేదు. ఇల్లుచూసుకున్న దాన్ని, సామానూ చూసుకోగలను" అంది దర్పంగా. భార్య వంక అర్థవంతంగా చూసాడాయన చిరునవ్వు దాచుకుంటూ.

"అడ్వాన్స్‌గా రెండు, మూడు నెలలు అద్దె అడుగుతారు. కావలిస్తే ఇస్తాను. అడుగు. ఫస్టులోగా చూసుకుంటే డబ్బు కట్టేయవచ్చు" ఉదారంగా అన్నాడు. తండ్రి మాటలు వింటుంటే ఆయన ఈవిషయం మర్చిపోలేదని, తను దాటేయడానికి లేదని అర్థం అయి గుబులు అనిపించి వివర్ణమయిన మొహంతో విస విస లోపలికి వెళ్లిపోయింది.

* * * * * *

"అపర్ణా... నాకు చిన్న హెల్ప్ కావాలే! నన్ను కొన్నాళ్లు నీ అపార్ట్‌మెంట్‌లో ఉండనిస్తావా?" ఆఫీసులో తనతో పనిచేసే అపర్ణని అడిగింది భావన.

అపర్ణ ఆశ్చర్యంగా "ఎందుకు? ఏమయింది.. నా అపార్ట్‌మెంట్‌లో వుండడం ఎందుకు?" అంది.

"మొన్న జరిగిన సంఘటన తెల్సుగా. మా పేరెంట్స్ నీవు వేరే ఇంట్లో ఉండు, నీ ఇష్టం వచ్చినట్లుండు. మా యింట్లో వుండి ఈ పనులు, తిరగడాలు ఒప్పుకోం అని చెప్పేశారు. వేరే యిల్లు చూసుకోమన్నారు. తెలుసా, అంత ఖచ్చితంగా పొమ్మంటే నాకేం గతిలేదా, పోతాను. వేరే ఇల్లు, అదీ చూసుకునేలోగా నీ అపార్ట్‌మెంట్‌లో కొన్నాళ్లు ఉంటాను" పౌరుషంగా అంది.

"భావనా.. కాస్త కూల్‌గా ఆలోచించు. ఏ పేరెంట్స్ అయినా అర్ధరాత్రి అపరాత్రి తిరిగి వస్తుంటే ఊరుకుంటారా? ఇంకా మీవాళ్ళు ఒక్కర్తే కూతురువని సహిస్తూ వచ్చారు. ఇప్పుడు ఇల్లు వదిలి బయటికి రావడం అంటే తమాషా అనుకున్నావా? నీవు నా ఇంట్లో అసలుండగలవా.. అన్ని సుఖాల మధ్య పెరిగిన దానివి. సర్దుకోవడం అన్నది నీకసలు తెలియదు. మీ ఇల్లు మీ పద్ధతులు చూసినదాన్ని కాబట్టి చెబుతున్నాను. ఏదో ఒక గది, వంటగది, బాత్‌రూం ఉన్న ఇల్లు మాది. నాతో ఎలా అడ్జస్ట్ అవుతావు. అయినా అమ్మా నాన్నా మన మంచికోరే చెపుతారన్నది నీవు తెలుసుకోవాలి.

"అది కాదు. పొమ్మని ఖచ్చితంగా అన్నాక ఎలా ఉండాలి" కోపంగా అంది.

"అంటారు మరి. నిన్ను ఎలా కంట్రోలు చెయ్యాలో తెలియక ఆ నిర్ణయానికి వచ్చి వుంటారు. భావనా, అమ్మా నాన్న అండ వున్న నీకు వాళ్ల విలువ అర్థం కావడంలేదు. నాకు నాన్న లేరు. అమ్మ అన్నయ్య దగ్గర గతిలేక పడివుంది. నాకు తెల్సు ఒంటరిగా వుంటూ నేను ఎదుర్కొనే సమస్యలు. నీవెంత అదృష్టవంతురాలివో నీకు తెలియదు. అన్నీ అమర్చిపెట్టి అపురూపంగా చూసుకునే తల్లిదండ్రులున్నారు. మొన్న పోలీస్‌స్టేషన్‌కి వచ్చి నిన్ను విడిపించుకోవడానికి ఎంత తాపత్రయపడ్డారు. వాళ్లే లేకపోతే నీ మొహం చూసి ఎవరు సాయం చేసేవారు? తల్లిదండ్రులుగా బాధ్యతలే కాదు, హక్కులూ వుంటాయి వాళ్లకి. వాళ్ల హక్కులని నీవు అంగీకరించక పోతే నీపట్ల వాళ్లెందుకు బాధ్యత తీసుకోవాలి? అందుకే నీతోవ నిన్ను చూసుకో మన్నారు. నీవెంత తప్పుగా ఆలోచిస్తున్నావో తెల్సుకుని నీ ప్రవర్తన మార్చుకో. వాళ్లకి క్షమాపణ చెప్పి, యిక ముందు ఇలాంటి వాటికి దూరంగా ఉంటానని..."

"అంటే, నేనింక ఏ సరదాలు, స్నేహితులు లేకుండా ఇంట్లో పడివుంటాను అని చెప్పాలా వాళ్లకి. ఎంత తల్లిదండ్రులయినా ఒక వయసు వచ్చాక నన్నింకా కంట్రోలు చెయ్యాలని వాళ్లు చూస్తుంటే నేను భరించి వాళ్ల అదుపాజ్ఞలలో పడివుండాలా?" తీవ్రంగా అడిగింది.

"నీవు వాళ్లని తప్పుగా అర్థం చేసుకుంటున్నావు. నిన్ను ఆడపిల్లవని కట్టడిచేసి మూల కూర్చోపెట్టారా? చదివించారు. ఉద్యోగం చేసుకోమన్నారు. నీ సరదాలకి అడ్డురాలేదు. కానీ ఆ సరదాలకి హద్దు వుండాలని పేరెంట్స్ కోరుకుంటారు. ఎందుకంటే రేప్పొద్దున దాని వల్ల ఏం నష్టం జరిగినా నీ భవిష్యత్ పాడవుతుందని వాళ్లకి భయం ఉండదా! మొన్న జరిగిన సంఘటన వల్ల రేపు నీ పెళ్లికి ఆటంకం రావచ్చు. నీ పేరు పేపర్లో, టీవీల్లో వస్తే నీ మీద అందరికీ ఎంత చులకన భావం."

"పబ్‌లకి వెళితే చెడిపోయినట్టా" కోపంగా అడిగింది.

"చూడు! నీ వెంత సమర్థించుకోవాలన్నా, మన దేశం ఇంకా పబ్‌లలో ఆడపిల్లలు, మగ పిల్లలతో సమంగా తాగి అసభ్య నృత్యాలు చేస్తే ఎవరూ పట్టించుకోకుండా ఉండే స్థాయికి చేరలేదు. అలాంటి అమ్మాయిల గురించి తప్పకుండా మాట్లాడుతారు" నచ్చచెపుతున్నట్లుంది అపర్ణ.

మొహం మాడ్చుకుంది భావన. వెంటనే జవాబు తట్టలేదు.

"అయితే మీయింటికి రావద్దంటావా?" ఇంకేం అనాలో తెలియక అడిగింది.

"నేనింత చెప్పాక కూడా ఇంకా నీ అభిప్రాయం మారకపోతే తప్పకుండా వుండచ్చు. నీ స్టాండర్డ్‌కి ఏ విధంగానూ తగదు నా ఇల్లు.. వచ్చి చూసుకో."

అపర్ణ యింటికి వెళ్లి చూశాక సగం జాపకారింది భావన. చిన్న గది. ఓ మంచం, టేబిల్, అలమార నిండా పుస్తకాలు, బట్టలు వంటింట్లో కిరసనాయిల్ స్టవ్. కొన్ని గిన్నెలు, డబ్బాలు, చిన్న బాత్‌రూమ్. బాత్‌రూంలోకి తొంగి చూశాక తమ యింట్లో మిలమిల మెరిసే బాత్‌రూము గోడలు, వాష్‌బేసిన్, వంటింటి గట్టంతా చిందర వందరగా సామాను. మా ఇంట్లో తనుండగలదా, ఇంపాసిబుల్, భావన మొహం చూసి నవ్వింది అపర్ణ.

"ఉంటావా ఇక్కడ" అంది.

గుటకమింగి "ఇద్దరికి సరిపోదులే. వేరే ఇల్లు చూసుకోవాలి" అంది నసుగుతూ.

"భావనా, నీకన్నీ హైక్లాస్ అలవాట్లు. నీకొచ్చే పాతికవేలలో ఓ పదివేలు ఇంటి అద్దె పోతే మిగతా కొంత ట్రాన్స్‌పోర్టు. ఆ మిగిలిందే నీ అవసరాలకి. నీ జీతం ఇన్నాళ్లు మీ వాళ్లిచ్చిన సుఖాలు ఇవ్వగలదా, ఆలోచించుకో! తొందరపడకు. స్నేహితురాలిగా నా సలహా. తీరి కూర్చుని పంతానికిపోయి సుఖాన ఉన్న ప్రాణాన్ని దుఃఖపెట్టుకోకు. నాకు చదువు చెప్పించడమే అమ్మకి గగనమైంది. నా సంపాదనలో కొంత అమ్మకి పంపాలి. చదువుకయిన అప్పు కాస్త తీర్చాలి. నాలాంటి ఇబ్బందులు లేని సుఖమయ జీవితం నీది. నీ అదృష్టానికి సంతోషించి మీ అమ్మానాన్నలు నీ శ్రేయోభిలాషులని గుర్తించు" అపర్ణ స్నేహితురాలు భుజం తట్టి అంది.

"థాంక్స్... నీ ఉపదేశానికి సంతోషించాను. వస్తా" బయటకు వెళ్లింది భావన. దారిపొడవునా, తనేం చెయ్యాలో అర్థం కాక సతమతమైంది.

* * * * * *

రాత్రి రమ కూతురి గదిలోకి వచ్చి "భావనా, రేపే ఒకటో తారీఖు. మీ నాన్న ఇల్లు ఏదన్నా చూసుకుందా అని పదే పదే అడుగుతున్నారు."

"ఏమిటాయన ఉద్దేశం. ఆయన వెళ్లిపో అంటే వెళ్లిపోవడానికి నేనేం చవట దద్దమ్మని కాను. నన్ను కనమని నేనడిగానా, నా పర్మిషన్ తీసుకుని నన్ను కని పెంచారా! మీ రుండమంటే వుండి, పొమ్మంటే పోవడానికి. నేనాయన కూతురిని. నాకీ ఇంట్లో అన్ని హక్కులు ఉన్నాయి. మీరే చెప్పారుగా కూతురి పెళ్లి చేసి పంపే

బాధ్యత మీదని. నా పెళ్లయ్యేవరకూ ఈ ఇంట్లోంచి పొమ్మనే హక్కు మీకు లేదు. కన్నాక చేతులు దులుపుకునే హక్కు మీకు లేదు" దబాయింపుగా అంటూ తల్లి వంక కోపంగా చూసింది. జవాబు చెప్పమన్నట్టు.

"ఓహో! హక్కుల దాకా వెళ్లావా, అవును చదువు కున్న అమ్మాయివి కదా!" రమ నవ్వింది.

"అవును, నా హక్కు నాకు తెలుసు. ఆడపిల్ల ఇల్లు దాటేది పెళ్లయ్యాకేగా! అప్పటి వరకు నే కదలను. ఇక్కడనుండి" మొండిగా అంది.

"అయితే త్వరగా పెళ్లి చేసుకుని వెళ్లు" రమా అంతకంటే మొండిగా పట్టువదలని దానిలా అంది.

"కూతురి పెళ్లి చెయ్యాల్సిన బాధ్యత మీది. చెయ్యండి పెళ్లి, చేసి పంపండి. అప్పుడే ఇక్కడ నుంచి కదులుతా. ఇన్నాళ్లు నే చేసుకుంటానన్నాను. ఇప్పుడామాట వెనక్కి తీసుకుంటున్నాను. తీసుకురండి మంచి మొగుడ్ని. చెయ్యండి పెళ్లి" అరుస్తున్నట్టే అంది.

రమ కూతురి వంక కాస్త ఆశ్చర్యంగా చూస్తూ, "మొగుడ్ని కొట్టి మొగసాల ఎక్కిందన్న సామెత అంటే, ఇదే" అంది నవ్వి. భావన కోపంగా చూసింది.

కూతురు ఆఖరికి దారికి వచ్చిందన్న సంతోషం తల్లిది. తనకి తాను నచ్చిన వాడిని చూసుకోవడం కుదరలేదు. ఆబాధ్యత తల్లిదండ్రులమీద వేసేస్తే, ప్రస్తుతానికి ఈ గొడవ తప్పించుకోవచ్చు. తల్లీ తండ్రి మంచివాడినే వెతుకుతారన్న నమ్మకం కూతురిది. ఎవరికి వారికి నిశ్చింతగా అన్పించింది ఆక్షణాన.

* * * * * *

ప్రతి కథకీ ఓ ముగింపు వుంటుంది. ఆ క్షణాన తల్లీ కూతుళ్లకి నిశ్చింత అన్పించినా, కూతురు గతం భవిష్యత్తులో ఆమె పెళ్లికి ఏమన్నా అడ్డు పడుతుందా అన్నది తల్లికీ తట్టలేదు. ఎంత నవీన భావాలు, హైక్లాస్ సొసైటీలో తిరిగినా మగవాడూ పెళ్లి దాకా వచ్చేసరికి సాంప్రదాయాలు పట్టుకు వేళ్లాడతారన్నది కూతురికి అసలే తట్టలేదు. అంచేత భవిష్యత్తు ప్రశ్నార్థకం? జవాబుకి ఆగాల్సిందే! అప్పటి వరకు ఈ కథ 'సశేషమే'!

***(ఆంధ్రభూమి వారపత్రిక, 8.8.2013)***